క్లుప్తంగా

విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి



ఐలవరం(భట్టిప్రోలు): నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఆంగ్ల భాషపై పరిజ్ఞానం అత్యవసరమని భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూలు ఆంగ్లోపాధ్యాయుడు హరికృష్ణ పేర్కొన్నారు. విద్యార్థులకు వెబ్ టెన్సెస్‌పై శుక్రవారం హైస్కూల్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. హరికృష్ణ మాట్లాడుతూ ఆంగ్లంలో రాయడం, మాట్లాడేందుకు వెబ్ టెన్సెస్ ఆవశ్యకత ఎంతో ఉందని అన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు వీటిని గూర్చి వినూత్న రీతిలో వివరించారు. ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు హైస్కూళ్ల విద్యార్థులతో పాటు ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఎంఈవో–2 నీలం దేవరాజ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



కర్లపాలెం: అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యనందించటం జరుగుతుందని బాపట్ల సీడీపీవో బి.శైలజ తెలిపారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని బంగారురెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. దీనిలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ ప్రైమరీ–1, ప్రీ ప్రైమరీ–2 సిలబస్ పూర్తి చేసుకుని ప్రాథమిక పాఠశాలలో చేరటానికి సిద్ధంగా ఉన్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సీడీపీవో కోరారు. 3 నుంచి 6 ఏళ్ల వయస్సు గల చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో బి.లక్ష్మీ పార్వతి, సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ, నాగలక్ష్మి, వాణి, ధనలక్ష్మి, జాలమ్మ, రాములమ్మ, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంతో సుస్థిర పాలన



వేమూరు: రాజ్యాంగం పౌరుడికి కల్పించిన ఓటు వజ్రాయుధం లాంటిదని ఎంపీడీవో చంద్ర శేఖర్ తెలిపారు. వేమూరు మండల కేంద్రంలో శుక్రవారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు పొందడంతో పాటు ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అలరించిన నమూనా ప్రదర్శన



తెనాలిఅర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 'స్వీప్' కార్యక్రమంలో భాగంగా తెనాలి మున్సిపల్ కార్యాలయం ముందు కమిషనర్ బండి శేషన్న ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఉద్యోగులు 'ఓటు వేద్దాం 91–తెనాలి మే 13న' అక్షరాలు ప్రతిబింబించే విధంగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, మున్సిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాల అధికారులు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత భక్తి విభావరి

నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు గాంధీ బొమ్మ కూడలిలోని కోదండ రామాలయంలో శ్రీ రామ నవమి మహోత్సవాలు శుక్రవారం కొనసాగాయి. ఉదయం వేళల్లో స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకం, అర్చన, అలంకార పూజలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సాయంత్రం సినీ సంగీత భక్తి విభావరి నిర్వహించగా, భక్తులను అలరించింది. ఆలయ చైర్మన్ కొమ్మినేని శివకోటేశ్వరరావు (బాబు), ఉపాధ్యక్షుడు కిలారి ఆదినారాయణ, కార్యదర్శి కొమ్మినేని ప్రసాద్, సభ్యులు కె.కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్, కిలారి రత్తయ్య, సీతారామయ్య, శ్రీవాసవి ఈవెంట్స్ నిర్వాహకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలనలో క్రీడలకు మహర్దశ

- రేపల్లెలో శరవేగంగా ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు
- రూ.2 కోట్ల నిధులు విడుదల చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- నిర్మాణం పూర్తయితే క్రీడాకారులు శిక్షణ పొందేందుకు అవకాశం
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు, యువత



రేపల్లెలో నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం

రేపల్లె రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. దీనిలో భాగంగా 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహించి గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసింది. క్రీడాకారులు క్రీడల్లో మరింతగా రాణించాలంటే క్రీడా మైదానాలు అవసరమని భావించిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా రేపల్లెలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ప్రత్యేక నిధులను కేటాయించింది. తద్వారా క్రీడాకారుల ప్రతిభను గుర్తించడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వారిని పంపాలనేది ప్రభుత్వం ఆశయం.

దీనిలో భాగంగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు ప్రత్యేక చొరవతో రేపల్లె పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో గత ఏడాది ఇండోర్ స్టేడియం పనులు ప్రారంభించారు. శరవేగంగా జరుగుతున్న స్టేడియం నిర్మాణ పనులు పూర్తయ్యి వినియోగంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ గల క్రీడాకారులు శిక్షణ పొందేందుకు చక్కని వేదికగా మారుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. క్రీడా ప్రాంగణం తుది దశకు చేరుకోవడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

జనసేన నాయకుల వ్యాఖ్యలు అర్థ రహితం

- వైఎస్సార్ సీపీ హయాంలో ఓల్డ్‌టౌన్‌లో రహదారి విస్తరణ
- వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి

రేపల్లె రూరల్: జనసేన నాయకులు వాస్తవాలను గ్రహించి మాట్లాడాలని ఇష్టానుసారంగా అవాస్తవ వ్యాఖ్యలు చేసి అభాసుపాలు కావొద్దని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి హితవు పలికారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 3వ వార్డులో రహదారికి గుంత ఏర్పడిందని ఆ గుంత కూడా పూడ్చలేని ప్రభుత్వం రాజధాని ఏ విధంగా నిర్మిస్తుందని వ్యాఖ్యలు చేయటం సబబు కాదన్నారు. రహదారి గుంత ఏర్పడిన ప్రాంతం నేషనల్ హైవేకు చెందినదని సమస్యపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించి పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. ఓల్డ్‌టౌన్‌లో సుదీర్ఘ కాలంగా రహదారి విస్తరణ సమస్య వేధిస్తోందని ఎంతో మంది ప్రజా ప్రతినిధులు రహదారి విస్తరణ చేయదలచి ప్రయత్నాలు చేసినా అవాంతరాలు ఎదురై ఈ సమస్య అలానే ఉండిపోయిందన్నారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అక్కడి ప్రజల అనుమతితో రహదారి విస్తరణ చేసి ఓల్డ్‌టౌన్‌ను గోల్డ్‌టౌన్‌గా మార్చివేశారన్నారు. రహదారి విస్తరణలో గృహాలు, దుకాణాలు కొంత భాగం కోల్పోయినప్పటికీ న్యాయం చేయటం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కన్యకా పరమేశ్వరి ఆలయంలో కొంత భాగం కోల్పోవటం జరిగిందన్నారు. రూ.25 లక్షల నిధులతో అమ్మవారి ఆలయం నిర్మించబడిందన్నారు. మార్కెట్ సెంటరులో శిథిలావస్థకు చేరిన విఘ్నేశ్వరుడి ఆలయం నిర్మాణ దశలో ఉన్నట్లు చెప్పారు. సాయినాథుని ఆలయం తొలగింపు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ఆ ప్రాంత ప్రజల అనుమతితోనే జరిగిందని ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసే సమయానికి ఎన్నికల కోడ్ రావటంతో నిలిచిపోయిందన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు కూల్చివేసిన 300లకు పైగా దేవాలయాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పునర్నిర్మించారని గుర్తు చేశారు. ప్రచార ఆరాటం ఉంటే జనసేన నాయకులు సరైన సమస్యలతో ముందుకు రావాలన్నారు. తెలిసీ తెలియని విధంగా ఒక అంశంపై పూర్తి సమాచారం తెలుసుకోకుండా అవగాహనా రాహిత్యంతో మాట్లాడటం తగదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేసే స్థాయి జనసేన నాయకులకు లేదన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, 3వ వార్డు కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు, నాయకులు కట్టా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలు దూరం



మదర్‌థెరిసా వైద్యశాలలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రేపల్లె రూరల్: చిన్నపాటి నిర్లక్ష్యంతో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునేందుకు అవకాశం ఉందని అగ్నిమాపక శాఖ అధికారి వై.సాంబశివరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని మదర్‌థెరిసా హాస్పిటల్, నాగార్జున నర్సింగ్ హోమ్‌లో శుక్రవారం వైద్యశాల సిబ్బంది రోగులు, ప్రజలకు అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంట్లో వంట చేసే సమయంలో గానీ, విద్యుత్‌ను వినియోగించే సమయంలో గానీ ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదాలకు తావిచ్చినట్లేనన్నారు. వంట గది, దుకాణాలు, వైద్యశాలలు, విద్యాసంస్థలు, సినిమా హాల్స్, కల్యాణ మండపాలు, ఆఫీసులు, పెట్రోలు బంకులలో అప్రమత్తత అవసరమని అన్నారు. ప్రమాదం వాటిల్లితే మంటలను అదుపు చేసే పరికరాలు ముందస్తుగా అందుబాటులో ఉంచటంతో పాటు ఆ పరికరాలు వినియోగించే విధానంపై అవగాహన ఉండాలని సూచించారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో వరిగడ్డి, వరికుప్పలు అగ్ని ప్రమాదాలకు గురై దగ్ధమౌతున్నాయని వీటిపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు వాటిల్లినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బంది ప్రయోగ పూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నాగేశ్వరరావు, ఎస్.నాగేంద్రరెడ్డి, జీ.కోటేశ్వరరావు, వి.సుబ్బారావు, ఎం.జనార్దనరావు, కేవీ సాయి కృష్ణారెడ్డి, పి.హరిబాబు, బీ.వీరకుమార్, సిహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వెల్లటూరులో ఎన్నికల ప్రచారం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరులో శనివారం సాయంత్రం 4 గంటలకు వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. గ్రామంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొంటారని కార్యాలయ సిబ్బంది శుక్రవారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎంపీ నందిగం సురేష్ గెలుపుకు కృషి చేద్దాం

వేమూరు: బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి నందిగం సురేష్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు పిలుపునిచ్చారు. బాపట్లలో ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ నామినేషన్ కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్నారు. పార్టీ నాయకులంతా ఐక్యతతో పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కర్లపాలెం: మండల పరిధిలోని ఓ గ్రామంలో వివాహిత మహిళ అదృశ్యమైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ జనార్దన్ తెలిపిన వివరాల మేరకు నల్లమోతువారిపాలెం గ్రామంలో శుక్రవారం తెల్లవారు జామున ఓ వివాహిత యువతి తన ఇంటి ముందు ముగ్గు వేస్తూ అదృశ్యమైనట్లు తెలిపారు. ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక గ్రామాలలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ పి.ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మత్తుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు విఘాతం కలగనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

11 మంది వలంటీర్లు రాజీనామా

జంపని(వేమూరు): జంపనిలో 11 మంది గ్రామ సచివాలయ వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా పత్రాలను శుక్రవారం అందజేశారని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 135 మంది వలంటీర్లు రాజీనామా చేయడం జరిగిందన్నారు. రాజీనామా పత్రాలు సంబంధిత అధికారులకు పంపించడం జరుగుతుందని చెప్పారు.

పేద ఆర్యవైశ్య దంపతులకు సామూహిక షష్టి పూర్తి

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో శుక్రవారం సామూహిక షష్టిపూర్తి మహోత్సవాలను నిర్వహించారు. పట్టణానికి చెందిన మదుపల్లి వెంకట మోహన్ శ్రీనివాస్–పద్మజ దంపతుల షష్టిపూర్తి సందర్భంగా ఆర్య వైశ్య సంఘీయుల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన షష్టిపూర్తికి చేరువైన 24 మంది పేద దంపతులకు సామూహిక ఉచిత షష్టిపూర్తి మహోత్సవాలను జరిపించారు.వృద్ధ దంపతులకు మదుపల్లి కుటుంబ సభ్యులు నూతన వస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో భాగంగా ఆర్య సమాజం వేద ధర్మ ప్రచార సంస్థచే లోక కల్యాణం కోసం ఆయుష్ హోమం, మహా మృత్యుంజయ హోమం జరిపించారు. ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో బీసీలకు ప్రాధాన్యం



బీసీల సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

కూచిపూడి(వేమూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యత కల్పించడం జరిగిందని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమర్తలూరు మండలంలోని మూల్పూరు గ్రామానికి చెందిన బీసీలతో కూచిపూడి పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయంగా అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. బీసీలంతా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీసీ నాయకులు పాల్గొన్నారు.

కోన నామినేషన్‌కు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



కర్లపాలెం: వైఎస్సార్ సీపీ బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా శుక్రవారం కోన రఘుపతి నామినేషన్ వేయటంతో కర్లపాలెం మండలంలోని 20 గ్రామ పంచాయతీల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు బాపట్ల తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో యువకులు ద్విచక్ర వాహనాలపై తరలివెళ్లారు. నాయకులు, మహిళలు కార్యకర్తలు, ట్రాక్టర్లు, ఆటోలలో అధిక సంఖ్యలో బాపట్లకు వెళ్లారు. బాపట్ల వెళ్లిన వారిలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి, ఎంపీపీ యారం వనజ, వైస్ ఎంపీపీలు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, యూత్ విభాగం అధ్యక్షుడు చిక్కాల సాగర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సలగల ధర్మేంద్ర, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎస్‌కె షంషీర్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పోతురాజు వెంకటేశ్వరమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు ఉన్నారు.

రంగస్థల వేదికపై అలరించనున్న 'మట్టి మనిషి'

- 24న హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రదర్శన
- దర్శకత్వం వహించిన ప్రఖ్యాత దర్శకురాలు నస్రీన్ ఇషాక్



మట్టిమనిషి నవల

తెనాలి: పొన్నూరు సమీపంలోని చేబ్రోలుకు చెందిన సుప్రసిద్ధ రచయిత డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి నవల 'మట్టిమనిషి' రంగస్థల నాటకంగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ప్రముఖ నాటక సంస్థ నిభా థియేటర్ ఎన్సెంబుల్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ సాయంత్రం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ నాటికను ప్రదర్శించనున్నారు. తెనాలి నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ ఈ నవలను నాటకీకరించగా, సుప్రసిద్ధ రంగస్థల నటి, దర్శకురాలు నస్రీన్ ఇషాక్ దర్శకత్వంలో ప్రదర్శనకు సిద్ధమైంది. డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి మెమోరియల్ ఫౌండేషన్ సహకారం అందిస్తోంది. 1970లో 'మట్టిమనిషి' నవల ఓ దినపత్రికలో ఆదివారం అనుబంధంలో సీరియల్‌గా ప్రచురితమైంది. 1972లో ప్రచురితమైంది. 1995–2000లో ఉస్మానియా యూనివర్శిటీ ఎంఏ ఫైనల్ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపిక చేసింది. నేషనల్ బుక్‌ట్రస్ట్ ఆఫ్ ఇండియా 14 భారతీయ భాషల్లోకి అనువదించి ప్రచురింపజేశారు. 'మాస్టర్ పీసెస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్' అనే కాలమ్‌లో ప్రస్తావించిన నన్నయ నుంచి నేటి వరకు వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప రచనల్లో 'మట్టిమనిషి' నవలను 13వ రచనగా పేర్కొన్నారు.

నూతనోత్తేజం నస్రీన్ ఇషాక్

నాటక దర్శకురాలు నస్రీన్ ఇషాక్‌కు 20 ఏళ్లకు పైగా అనుభవముంది. ఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ)లో గ్రాడ్యుయేషన్ చేశారు. నటిగా సుప్రసిద్ధ దేశ, విదేశీ నాటకరంగ దర్శకులతో పనిచేశారు. ఎన్ఎస్‌డీలో నటిగా ఏడేళ్ల అనుభవం. వివిధ సంస్థల్లో చలనచిత్ర అధ్యాపకురాలిగా, డబ్బింగ్ కళాకారిణిగా, కాస్ట్యూమ్ డిజైనర్‌గా, థియేటర్ ఆర్ట్స్ అధ్యాపకురాలిగా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ గెస్ట్ లెక్చరర్‌గా చేశారు. హైదరాబాద్‌లోని 'సమాహార' అనే సంస్థ సహచర్యంతో తన సొంత గ్రూప్ 'నిభా థియేటర్ ఎన్సెంబుల్'తో 2016 నుంచి నాటకాలకు దర్శకత్వం వహిస్తున్నారు. పలు విదేశీ నాటకాలను హిందీలోకి అనువదించారు. చలం రచించిన 'మైదానం' నవలను రంగస్థలంపైకి తీసుకురావటం గొప్ప ప్రయోగం. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ 'పాకుడురాళ్లు' నవలను అదే పేరుతో నాటకంగా తీసుకొచ్చారు. మళ్లీ ఇప్పుడు వాసిరెడ్డి సీతాదేవి నవల 'మట్టిమనిషి' నాటకంగా జనంలోకి వస్తోంది.

25 నుంచి సంస్కృత భాష శిక్షణ తరగతులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస శర్మ, మురళీకృష్ణ

తెనాలిఅర్బన్: కోట లక్ష్మయ్యనాయుడు సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శ్రీ వైఖానస సేవా సంఘం తెనాలి వారి సహకారంతో ఈ నెల 25 నుంచి గంగానమ్మపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో సంస్కృత భాషా ప్రవేశ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

వేణుగోపాలస్వామి దేవస్థానం ఆవరణలో శుక్రవారం శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ ధార్మిక ప్రచారకులు డాక్టర్ డీఎస్ దీక్షితులు, దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి మల్లీశ్వరిలు తరగతులను ప్రారంభిస్తారని చెప్పారు. ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. సూరేపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ప్రముఖ సంస్కృత పండితులు బ్రహ్మశ్రీ కుచిబట్ల శ్రీనివాసశర్మ శిక్షణ ఇస్తారన్నారు. తెనాలి పట్టణం, పరిసర గ్రామాల్లోని పెద్దలు, పిల్లలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డి.మురళీకృష్ణ, మేడూరి శ్రీనివాసమూర్తి, పి.వి నాయకరావు, సిహెచ్. రామలింగేశ్వరరావు, టి.రఘునాగమల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పల్లె పల్లెన దళిత ఘీంకారం సమావేశాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్

నెహ్రూనగర్: దళిత సమాజం ఎదుర్కొంటున్న కొన్ని సంఘటనలపై పల్లె పల్లెన దళిత ఘీంకార చైతన్య సమావేశాలు డిసెంబర్ వరకు నిర్వహించనున్నట్లు భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం అరండల్‌పేటలో భీమ్ భారత్ కార్యాలయంలో చైతన్య సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రస్తుతం దళిత గిరిజనులకు కల్పిస్తున్న రిజర్వేషన్ల విధానం అనేది ఒక తాత్కాలిక ఉపశమనంగానే పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిన్నతనం నుంచే అంటరాని తనాన్ని అనుభవించి భావితరాల వారు తాను అనుభవించిన వివక్ష అనుభవించకూడదనే ఉద్దేశంతో విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు తీసుకువచ్చారన్నారు. రిజర్వేషన్ల ఫలాలు అనుభవించిన వారు తిరిగి సమాజానికి మేలు చేయకపోగా రాజకీయ పార్టీలకు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. అణగారిన వర్గాల అభ్యున్నతి, అభివృద్ధే ధ్యేయంగా పల్లె పల్లెన చైతన్య సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సంఘ నాయకులు రాజేంద్రప్రసాద్, కమల్‌కుమారి, మామిడి సునీల్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

తెనాలిఅర్బన్: ఫ్రైడేను డ్రైడేగా అంతా పాటించాలని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల సూచించారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లో దోమల నియంత్రణకు అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఇంటి పరిసరాల్లో ఉన్న పాత వస్తువుల్లోని నీటిని తొలగించాలని సూచించారు. దోమకాటు వలన అనే వ్యాధులు ప్రబలుతాయని చెప్పారు. తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నీటి కుంటలు, పాత వస్తువులు దోమలకు నిలయాలని చెప్పారు. వాటిని ప్రతి శుక్రవారం శుభ్రం చేయాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సుల్తానాబాద్‌లోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, బండారు మల్లీశ్వరరావు, జి.రవికుమార్, టి.శివరామప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు, మలేరియా, ఫైలేరియా, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రలోభాలపై అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మీపురం: లోక్ సభకు, అసెంబ్లీకి ఏక కాలంలో ఎన్నికలు జరుగుతున్న ఈ సమయంలో ప్రలోభాలతో మభ్యపెడుతున్న పార్టీలపై ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని సీమాంధ్ర మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన చర్చ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న బహుజనవాది

పెదకాకాని: పెదకాకాని గౌడపాలెం సర్దార్ గౌతు లచ్చన్న భవన్‌లో శుక్రవారం గౌతు లచ్చన్న 18వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గౌడ ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షులు బొర్రా అంకయ్య అధ్యక్షత వహించారు.
రాష్ట్ర బీసీ నాయకుడు కుక్కల రామ్ ప్రసాద్ లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న బహుజనవాది అని కొనియాడారు. ప్రజా సమస్యలపై ముఖ్యంగా కార్మిక,కర్షక, అంటరాని తనానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నడపడంతో పాటు వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని ధారపోసిన సౌమ్య శీలుడు లచ్చన్న అని శ్లాఘించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉప్పాల శివాజీ, క్రోసూరు పూర్ణచంద్రరావు, కుక్కల మల్లేశ్వరరావు, కారంకి వెంకటేశ్వరరావు, పాగోలు శ్రీనివాసరావు, పాగోలు శివనాగమల్లేశ్వరరావు, పాగోలు రాము, కుక్కల శివ నాగ గోపి, శ్రీనివాసరావు, తుళ్లూరు నరసింహారావు, వడ్లమూడి నాగరాజు , పాగోలు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నల్లపాడు కేంద్రియలో ప్రేరణ ఉత్సవం

గుంటూరు రూరల్ : గుజరాత్ రాష్ట్రం వాద్‌నగర్ వెర్నాక్యులర్ పాఠశాలలో జరగబోయే ప్రేరణ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థుల తుది ఎంపిక జరగనుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నల్లపాడులోని పీఎం కేంద్రియ విద్యాలయంలో 2024 జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారత దేశం నా విజన్ , వికసిత్ భారత్, ప్రేరణ ఉత్సవానికి విద్యార్థులను ఎందుకు ఎంపిక చేయాలనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన, కవిత, చిత్రలేఖన ప్రదర్శించేలా ప్రోత్సహించడం జరిగిందన్నారు. ఈ ప్రేరణ ఉత్సవంలో జిల్లా వ్యాప్తంగా 60 పాఠశాలల నుంచి ఒక్కో పాఠశాలకు బాలుడు, బాలిక చొప్పున 120 మంది పాల్గొన్నారని తెలిపారు. వీరి నిష్పాదన మూల్యాంకన అనంతరం వ్యక్తిగత ఇంటర్వ్యూలు, మార్కుల ఆధారంగా 30 మందిని ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైనవారి వివరాలను ప్రేరణ పోర్టల్‌లో అప్‌లోడు చేస్తామని డీఈఓ వివరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు ప్రసన్న, టి.ఎస్.సునీల, ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.